

ములుగులో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం

# ఈదురుగాలులతో వర్షం

- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఇబ్బందులు పడ్డ పోలింగ్ సిబ్బంది

ములుగు, మే 12 (నమస్తే తెలంగాణ)/వాజేడు/గణపురం : ములుగు జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. ఈదురు గాలులతో మొదలైన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది వాటిని సరిచేసుకుంటున్న సమయంలో కురిసిన వర్షానికి ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలింగ్ కేంద్రాలలో బస చేసిన అధికారులు చీకట్లోనే భోజనాలు చేశారు. జిల్లా కేంద్రంలో రాత్రి 7 గంటలకు ఈదురు గాలులు మొదలై 9.30 వరకు వర్షం కురిసింది. అలాగే వాజేడు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షంతో పాటు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో వీచిన ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల విధులకు వచ్చిన సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీకట్లోనే సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో భోజనాలు చేశారు. భారీ వర్షాలు పడనున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికను ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక సిబ్బంది రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు.



గణపురం : చీకట్లో భోజనం చేస్తున్న పోలింగ్ సిబ్బంది



వాజేడు : ప్రగళ్లపల్లి గ్రామంలో వీస్తున్న ఈదురు గాలులు

# నిర్భయంగా ఓటు వేయాలి



పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

**ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్**

ములుగు, మే 12 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పోలింగ్‌లో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. భద్రతాపరంగా పోలింగ్ స్టేషన్ల వద్ద అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్ వద్ద ఒక పోలీస్ అధికారిని నియమించామన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా స్పందించేలా రూట్ మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సెక్టార్ ఇన్‌చార్జిలనే కాకుండా ఒక్కో ప్రాంతానికి డీఎస్పీ స్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర ఆర్మ్‌డ్ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులకు విధులు కేటాయించి భారీ భద్రత కల్పించామన్నారు. అనంతరం పంపిణీ కేంద్రం నుంచి ఈవీఎంలతో పాటు పోలింగ్ సామగ్రిని భారీ బందోబస్తు నడుమ ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సమావేశంలో డీఎస్పీ రవీందర్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, the undersigned **RONDLA SRIKAR REDDY** (New Name), previously called **RONDLA S REDDY** (Old Name), and residing at # H.No. 1-1-490/1/111/402, Rachana Nilayam, Chaithanya Puri Colony, Warangal-Hanumakonda - 506004.
NTW-00

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-323227

**RECRUITMENT**

★**Pen, Pencil Company, Educated,** Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

## కొత్త సీసీ కెమెరా ఏర్పాటు

గణపురం, మే 12 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని 147వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా మాయమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు మాయమైన కెమెరా స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. ఎవరు దొంగిలించారనే సమాచారం తెలుసుకునేందుకు అధికారులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారికి సైతం ఫిర్యాదు చేశామని, వీలైనంత త్వరలో మాయమైన సీసీ కెమెరా దొరుకుతుందని ఒక ఉన్నతాధికారి తెలిపారు.

## ఏజెన్సీలో పోలీసుల ముమ్మర తనిఖీలు

వెంకటాపురం (నూగూరు) మే 12 : వెంకటాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. చర్ల, భద్రాచలం నుంచి వచ్చి పోయే వాహనాలను క్షణ్ణంగా సోదాలు చేశారు. అనుమానితుల వివరాలు సేకరించారు. తనిఖీల్లో పోలీస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామప్పలో సండే సందడి

వెంకటాపూర్, మే 12 : రామప్పలో ఆదివారం సిరియా దేశస్తులతో పాటు పర్యాటకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ శిల్పసందపదను చూసి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్రను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. రామప్ప సరస్సుకు చేరుకొని బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.



పూజలు చేస్తున్న భక్తులు



ములుగులో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



కృష్ణకాలనీ : సామగ్రిని తరలిస్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా



ములుగు రూరల్ : ఎన్నికల సామగ్రి తరలిస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజ

# పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- సమస్యాత్మక కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- భూపాలపల్లి, ములుగు ఎన్నికల అధికారులు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి

కృష్ణకాలనీ/ములుగు రూరల్, మే 12 : పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని భూపాలపల్లి, ములుగు జిల్లాల ఎన్నికల అధికారులు భవేశ్ మిశ్రా, ఇలా త్రిపాఠి తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో, ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సామగ్రి పంపిణీ కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఉదయం 5.30 గంటలకు పార్టీ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. రిజర్వ్ ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని సెక్టార్ అధికారులు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ జరుగుతుందని, ఓటర్లు ఈ సమయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, ఫ్యాన్లు, క్యూలు, వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్లు, టాయిలెట్లు తదితర వసుతులు కల్పించామన్నారు. కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలను మోహరించినట్లు తెలిపారు. పీవో డైరీ నమోదులో అన్ని జాగ్రత్తలు పాటించాలని వారు ఆదేశించారు. ఏఆర్‌వో, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, భూపాలపల్లి, ములుగు అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీజ, ఆర్డీవోలు మంగీలాల్, సత్యపాల్ రెడ్డి, ములుగు డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న సిబ్బంది



భూపాలపల్లి నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



ములుగులో ఈవీఎంలు తీసుకొని పోలింగ్‌కేంద్రానికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న సిబ్బంది



ఏటూరునాగారం : పోలింగ్ కేంద్రం వద్ద పహారాకాస్తున్న పోలీసులు

# పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు

- ములుగు, భూపాలపల్లి జిల్లాల నుంచి తరలిన సిబ్బంది
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు జిల్లాల పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. వరంగల్ పరిధిలో రేగొండ, భూపాలపల్లి, మొగుళ్లపల్లి, చిట్యాల, గణపురం, టేకుమట్ల, గోరికొత్తపల్లి, మహబూబాబాద్ పరిధిలో ములుగు, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, గోవిందరావుపేట, వెంకటాపూర్, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం (నూగూరు), పెద్దపల్లి పరిధిలో కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల, మల్హర్ మండలాలున్నాయి. కాగా, ఆదివారం ఎన్నికల అధికారులు ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రి తీసుకొని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానున్నందున పోలీస్ అధికారులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. వాజేడు మండలం బొల్లారం గ్రామస్తులు ఆరుగుంటపల్లి గ్రామంలో, గుట్టలపై ఉన్న పెనుగోలు గిరిజనలకు జంగాలపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటువేసే ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ తెలిపారు. బొల్లారం, గుమ్మడిదొడ్డి గ్రామాల నుంచి వారిని తరలించేలా ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



వాజేడు : జగన్నాథపురం పోలింగ్ కేంద్రానికి భద్రాచలం నుంచి ఎన్నికల సామగ్రితో వచ్చిన పోలింగ్ సిబ్బంది



మహదేవపూర్ : పోలింగ్ సామగ్రితో బొమ్మాపూర్‌కు చేరుకున్న సిబ్బంది



చిట్యాల : కైలాపూర్ పోలింగ్ కేంద్రం వద్ద సామగ్రితో ఎన్నికల సిబ్బంది



టేకుమట్ల : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది




మంగపేట : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది



గణపురం : జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు

# అర్ధరాత్రి అక్రమ దందా

- రాంపురం ఇసుక ర్యాంపు నుంచి అయ్యవారిపేటలో డంపింగ్
- ఆంధ్రా కాంట్రాక్టర్ కనుసన్నల్లో తవ్వకాలు!
- పట్టించుకోని టీఎస్ఎండీసీ అధికారులు



రాంపురం ఇసుక ర్యాంపు నుంచి అర్ధరాత్రి లారీల్లో తరలిస్తున్న ఇసుక (ఫైల్)

వాజేడు, మే 12 : మండలంలో ఇసుక అక్రమ రవాణా అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్నది. అదనపు బకెట్ల పేరుతో కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. పోలీసులు అధిక లోడ్‌తో ఉన్న లారీలను సీజ్ చేసి కేసులు నమోదు చేసినా అక్రమార్కులు పట్టించుకోవడంలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రేజింగ్ కాంట్రాక్టర్ అయ్యవారిపేట, రాంపురం ఇసుక ర్యాంపులను ఇసుక సొసైటీల నుంచి చేజిక్కించుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన డీడీ కంటే అదనంగా ఒక్కో లారీలో ఐదు టన్నులకు పైగా ఇసుక బకెట్లు వేస్తూ ర్యాంపు నిర్వాహకులు ఒక్కో లారీ నుంచి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. ఇటీవల వరుసగా పేరూరు, వాజేడు పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అయ్యవారిపేట ఇసుక ర్యాంపు నుంచి అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇసుక ర్యాంపు నుండి రోజుకు వందల సంఖ్యలో లారీలు వెళ్తున్నా కొన్ని మాత్రమే పట్టుబడుతున్నాయి. అయితే సదరు కాంట్రాక్టర్ అదనపు బకెట్ల దందా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. రాంపురం ఇసుక ర్యాంపులో రేజింగ్ కాంట్రాక్టర్ కనుసన్నల్లో రాత్రి పూట యంత్రాలు, టిప్పర్ల సాయంతో ఇసుక తవ్వకాలు జరిపి అయ్యవారిపేట వద్ద డంపింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల అయ్యవారిపేట గ్రామస్తులు క్వారీల తమకు పని కల్పించాలని, లారీలతో రోడ్లు దెబ్బతింటున్నాయని ఆందోళన చేశారు. యంత్రాలతో పనులు చేయించొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ఎవరూ పట్టించుకోడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ దృష్టిసారించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న రేజింగ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



లారీలో యంత్రాల సాయంతో ఇసుకను నింపుతున్న కూలీలు

## మృతుడి కుటుంబానికి సిరికొండ పరామర్శ



పార్థివ దేహం వద్ద పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

గణపురం, మే 12 : మండలంలోని కర్కపెల్లి గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పొట్ల నగేశ్ తండ్రి, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు (75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మృతుడి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సీసీ రోడ్డు వేశారు.. సైడ్ బర్మ్‌లు మరిచారు

**ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

మహదేవపూర్, మే 12 : మండలంలోని బ్రాహ్మణపల్లి బీసీకాలనీలో ఇటీవల వేసిన సీసీ రోడ్డుకు ఇరువైపులా సైడ్ బర్మ్‌లు పోయడం మరిచారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సదరు కాంట్రాక్టర్ సైడ్ బర్మ్ పనులు ప్రారంభించలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోడ్డుపై వాటర్ క్యూరింగ్ కోసం పోసిన ఇసుకను సైతం ఇప్పటి వరకు తీయకపోవడంతో అదుపు తప్పి కింద పడుతున్నామని పలువురు వాహనదారులు ఆరోపించారు. ఇప్పటికైనా రోడ్డుపై ఉన్న ఇసుకను పూర్తిగా తొలగించి, సైడ్ బర్మ్‌లు పోయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



సీసీ రోడ్డు పక్కన కుప్పలుగా పోసిన మట్టి, రోడ్డుపై ఉన్న ఇసుక